క్లుప్తంగా

మహిళలకు శిక్షణ శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీడీ

దుబ్బాకరూరల్: ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పూర్తిచేసుకున్న కూలీల కుటుంబాలకు చెందిన మహిళల కోసం ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ శిబిరాన్ని మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య మాట్లాడుతూ 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, ఏపీఓ శ్యామ్‌సుందర్, టీఏలు స్వామి, మహేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మిరుదొడ్డి(దుబ్బాక) / చిన్నకోడూరు(సిద్దిపేట): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాజేశ్, భూమాగౌడ్, సుదర్శన్, భూపాల్ గౌడ్, మహేశ్, బాలకుమార్, నర్సింహులు, కృపానందనం, శ్రీకాంత్, మహేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అబద్ధపు ప్రచారాలతో డ్రామాలాడుతున్నారంటూ డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్ర పటానికి శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నకోడూరులో ఫినాయిల్‌తో నోటిని శుద్ధిచేసి, అనంతరం చిత్ర పటాన్ని దహనం చేశారు.

అనీఫ్‌కు ఆపన్నహస్తం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు ప్రమాదంతో చిన్నాభిన్నమైన హనీఫ్ కుటుంబానికి ఆపన్న హస్తం అందిస్తామని మండల పరిధిలోని అల్వాల గ్రామస్తులు భరోసా ఇచ్చారు. 'ఆపన్నహస్తం కోసం ఎదురు చూపులు' రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి మంచానపడ్డ యజమాని.. భార్య, తల్లి అనారోగ్యం పాలు.. ఆదుకోవాలంటూ వేడుకోలు.. అంటూ జూలై 29న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికిక గ్రామస్తులు స్పందించారు. దాతల సహకారంతో హనీఫ్ కుటుంబానికి శనివారం బియ్యంతోపాటు, నిత్యావసర సరుకులు అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు ఏదుల్, నాయకులు పరశురాములు, దినకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రభుత్వాల లక్ష్యాలు నెరవేరతాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన కమ్మరి నర్సింహాచారికి ఆసుపత్రి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును శనివారం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మర్కూక్‌లో..

మర్కూక్(గజ్వేల్): మండలంలోని నర్సన్నపేట గ్రామానికి చెందిన కల్యాణికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.6వేల చెక్కును మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ సర్పంచ్ మాధవి బాధిత కుటుంబానికి శనివారం అందించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, రాంరెడ్డి, హరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బంజరు దొడ్డిలా 'బడి'

- ఉపాధ్యాయుడిపై ఎంఈఓ ఆగ్రహం
- ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిన పాఠశాల ఆవరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల రేగొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడి తీరుపై ఎంఈఓ దేశిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పాఠశాలకు సెలవు ఉందని పిల్లలు రాలేదంటూ ఉపాధ్యాయుడు సర్దార్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సాక్షి ఎంఈఓను సంప్రదించగా పాఠశాలకు సెలవు లేదన్నారు. అనంతరం ఎంఈఓ ఉపాధ్యాయుడితో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలకు సెలవు ఎవరిచ్చారని నిలదీశారు. పిల్లల హాజరు కోసం ప్రశ్నించారు. ముగ్గురు వస్తే హాజరు ఇద్దరికే ఎందుకు వేశారని అడిగారు. సీనియర్ ఉపాధ్యాయులై బాధ్యతగా ఉండడంలేదని తెలిసిందని, నిర్లక్ష్యంగా ఉండొద్దని మందలించారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తచెదారం పేరుకుపోయి ఉండడంపై మండిపడ్డారు. బడి బంజరు దొడ్డిలా మారిందని, స్కూల్ గ్రాంట్ ఎక్కడికి పోతుందని నిలదీశారు. ఈ పాఠశాలపై గ్రామస్తులకు మంచి అభిప్రాయం లేదని, ఉపాధ్యాయుల పనితీరుపై నమ్మకం కలిగినప్పుడే తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపిస్తారని హితబోధ చేశారు. పెద్ద ఊరైన ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడం శోచనీమన్నారు.

కుర్చీలోనే యూనిఫాంలు

విద్యార్థులకు పంపిణీ చేయవలసిన యునిఫాంలు ఇంకా కుర్చీలోనే దర్శనమిస్తున్నాయి. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల ప్రారంభంరోజే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసింది. కానీ రేగొండ బడిలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యునిఫాంలు కుర్చీలోనే ఉండడంపై గ్రామస్తులు ఉపాధ్యాయుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పిల్లలకు అందని యూనిఫాంలు

హిందూ సంఘాల బంద్ ప్రశాంతం



హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్/మద్దూరు(హుస్నాబాద్): బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న మారణహోమానికి నిరసనగా హిందూ సంఘాల ఐక్య వేదిక హుస్నాబాద్‌లో నిర్వహించిన బంద్ శనివారం ప్రశాంతంగా జరిగింది. వ్యాపార, వాణిజ్య, హోటళ్లు, వివిధ దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లోని హిందువులు మనోధైర్యం కోల్పోకుండా ఉండేందుకే బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకాశ్, నాగరాజు, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మద్దూరులో గ్రామ యువత మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండించారు.

ఉద్యమకారుడికి అండగా ఉంటాం

సాక్షి ఎఫెక్ట్..



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అప్పటి టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) పార్టీ కోసం సొంత ఖర్చులతో పార్టీ జెండాలు మోసి అప్పుల పాలై అనారోగ్యంతో జీవితాన్ని గడుపుతున్న బలిజ రమేశ్‌కు పార్టీలకతీతంగా అండగా ఉంటామని సీనియర్ జర్నలిస్టు నర్సింహులు, వివిధ పార్టీల నాయకులు మద్దెల రాజేశ్, కృపానందం భరోసానిచ్చారు. జూలై 18న 'సాక్షి'లో వచ్చిన 'దర్పం వెనుక కన్నీటి ధార' నాడు నడిపించి... నేడు నడవలేక అన్న కథనానికి వారు స్పందించారు. మిరుదొడ్డి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు ర్యాకం పుష్ప సహకారంతో నిత్యావసర సరుకులు అందజేశారు. అదేవిధంగా పలువురు కాంగ్రెస్ నేతలు రూ.వెయ్యి ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వం ఆదుకోనేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల జిల్లా నాయకులు చెన్నై భూపాల్ గౌడ్, మహేశ్, కుమార్, నర్సింహులు, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరించాలి



హుస్నాబాద్: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్/దుబ్బాకటౌన్/ కొమురవెల్లి(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట): సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం, బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తూ శనివారం హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల రుణమాఫీపై హరీశ్‌రావు చేసిన సవాల్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరించాలని డిమాండ్ చేశారు. దాడులతో భయపెట్టి ఆయనను ప్రజలకు దూరం చేయలేరని చెప్పారు. కార్యక్రమంలో అన్వర్ పాష, మాజీ వెంకట్, చంద్రయ్య, మల్లికార్జున్ రెడ్డి తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ నేతల దాడికి నిరసనగా దుబ్బాకలో సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దిష్టి బొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదగిరి, శ్రీనివాస్, స్వామి, భూంరెడ్డి, కృష్ణ, ప్రభాకర్ తదితరులున్నారు. అధికారపార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి అన్నారు. కొమురవెల్లి మండలంలోని రామ్‌సాగర్ గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రొటోకాల్ పాటించకుండా స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రారంభించడాన్ని తప్పుపట్టారు. తమ పార్టీ ఏనాడూ అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, తలారి కిషన్, ముత్యం నర్సింహులు తదితరలు పాల్గొన్నారు. అదేవిధంగా బెజ్జంకిలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన బత్తిని వెంకన్న(65) అనారోగ్యంతో మృతి చెందాడు. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాలు ప్రకారం.. కుటుంబ కలహాల వల్ల వెంకన్న తన భార్య, కొడుకుకు కొంత కాలం నుంచి దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై కోహెడ బస్టాండ్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న వెంకన్నను గమనించిన స్థానికులు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు సంపత్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైతుల నెత్తిన విద్యుత్ ప్రమాదం



వేలాడుతున్న విద్యుత్ తీగ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ మైసమ్మగుట్ట కింద వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు రైతు నెత్తిన వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నుంచి రైతులను రక్షించాలని కోరుతున్నారు. 10రోజుల కిందట ఇక్కడే నాటు బాంబుపేలి రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. రైతుల ప్రాణాలు పోకముందే విద్యుత్ తీగలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ అంతరాయం

గజ్వేల్‌రూరల్: బెజుగామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నిర్వహణ కారణంగా బెజుగామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జాలిగామ, బెజుగామ, బయ్యారం, పెద్ద ఆరెపల్లి, చిన్న ఆరెపల్లి, లింగారెడ్డిపల్లి, ముంగీస్‌పల్లి గ్రామాలకు ఉదయం 9:30 నుంచి 2:30వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధూళ్మిట్ట తహసీల్దార్‌గా మధుసూదన్



మద్దూరు(హుస్నాబాద్): ధూళ్మిట్ట తహసీల్దార్‌గా మధుసూదన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన శ్యామ్ సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మధుసూదన్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పత్తి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన రైతు ఎనకపల్లి నవీన్ సాగు చేసిన నాలుగు ఎకరాల్లో పత్తి పంటను శనివారం తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి పరిశీలించారు. ఆకులన్నీ ముడతలు రావడం, కాతపూత లేకపోవడంతో 11న సాక్షిలో' నకిలీ విత్తనాలా.. పిచికారీ ప్రభావమా' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. రైతు పిచికారీ చేసిన మందు డబ్బాలను, విత్తనాల ప్యాకెట్ల లాట్ నంబర్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పత్తి మొక్కలను ల్యాబ్‌కు పంపించామని, మోతాదుకు మించి మందులను పిచికారీ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిల్‌కుమార్, ఏఓ వసంతరావు, ఎఈఓ శరణ్య, సదానంద్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే శిక్షించండి



గజ్వేల్‌లో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు

- వైద్యులు, సిబ్బంది నిరసన, ర్యాలీలు

గజ్వేల్‌రూరల్/ములుగు(గజ్వేల్)/కొమురవెల్లి(సిద్దిపేట): కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను గుర్తించి వెంటనే శిక్షించాలని గజ్వేల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఇందిరా పార్కు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఏబీవీపీ నాయకులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మహేందర్, లలిత, ప్రదీప్, రాజు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్ సెంటర్‌లో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ గోపీకృష్ణ, శ్రవణ్‌కుమార్, సీఈఓ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఉన్న జూనియర్ డాక్టర్ మౌమిత హత్యను ఖండిస్తూ గ్రామానికి చెందిన యువత శనివారం రాత్రి కొమురవెల్లిలోని పోలీస్ బొమ్మవద్ద కొవ్వత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

పలు మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రాఖీ పండుగపై చిన్నారులకు అవగాహన కల్పించారు. అనంతరం వారి చేత రాఖీలు కట్టించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): అందె ఉన్నత పాఠశాలలో రాఖీలు చూపుతున్న విద్యార్థులు, టీచర్లు



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి గీతాపాఠశాలలో..



కొండపాక(గజ్వేల్):తిప్పారం ప్రాథమిక పాఠశాలలో..



జగదేవ్‌పూర్(గజ్వేల్): తోటి సిబ్బందికి రాఖీలు కడుతూ..

ఆ హెచ్‌ఎంను సస్పెండ్ చేయండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాల నిధులను దుర్వినియోగం చేసిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయకుండా డిప్యూటేషన్‌పై పంపించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్ మండిపడ్డారు. జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హనుమాన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన పద్మ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఆధారాలతో కలెక్టర్, జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోలేదని వాపోయారు. వెంటనే ఆమెను సస్పెండ్ చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అభిషేక్, భాను, నవదీప్, అజయ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

భూసారం కాపాడుకునే పద్ధతులపై శిక్షణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

అక్కన్నపేట(హుస్నాబాద్): భూసారం కాపాడుకునే పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లొడి సంస్థ మండల ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కేశనాయక్‌తండా పరిధిలోని చెరువుముందు తండా, చౌడుతండా, లచ్చానాయక్‌తండా, గొల్లపల్లిలో శనివారం మనోజ్ యూనిదాస్ సహకారంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. మట్టి కట్టలు, రాతికట్టలు చిన్నచిన్న కుంటలు నిర్మించుకుంటే నీరు నిల్వఉంటుందని, తద్వారా వర్షపునీరు వృథాగా పోకుండా భూమిలో ఇంకుతుందని సూచించారు. అంతే కాకుండా సేంద్రియ వ్యవసాయ విధానం చేపడితేనే భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వ్యక్తి అదృశ్యం

సిద్దిపేటరూరల్: డబ్బులు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని చింతమడకలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దెల్లి కిషన్ శుక్రవారం ఉదయం తాను హార్వెస్టర్ అమ్మగా వచ్చిన డబ్బులను తీసుకువస్తానని, వచ్చే వరకు తనకు ఫోన్ చేయవద్దని భార్య భవానీకి చెప్పి బైక్‌పై వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో భవాని ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12మందిని శనివారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.22వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను నూతన టెక్నాలజీ సాయంతో గుర్తించి వన్ టౌన్ పోలీసులు బాధితుడికి అందజేశారు. సిద్దిపేటకు చెందిన పవన్ కొన్ని రోజుల క్రితం పట్టణంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి ఎస్ఐ కనకయ్యగౌడ్ శనివారం అందజేశారు.

◆ కోతులతో ఇబ్బందులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్‌లో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి కోతుల పట్టించాలని కోరుతున్నారు. పాఠశాల సమీపంలోని ఇళ్లలోకి వచ్చిన కోతులు వంట ప్రాతలను ఎత్తుకెళ్లి ఆహారం నేల పాలు చేశాయని శనివారం పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ విద్యతోపాటు క్రీడలు కూడా అవసరం

కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనని మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ హైస్కూల్లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల శారీరక మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ నేడు పద్మశాలి సంఘం ఎన్నికలు

హుస్నాబాద్: తెలంగాణా ఏర్పడ్డాక మొదటిసారిగా రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు బూర్ల రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్‌లోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయంలో బూత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పద్మశాలి కులస్తులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

◆ వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యాశాఖ, వారధి ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారిని 20న సిద్దిపేటలో జరగనున్న జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేసినట్టు మండల నోడల్ అధికారి రంగా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, రవీందర్, రవి, కాల్‌రామ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ బ్యాంకు మేనేజర్‌కు వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): రుణమాఫీ అయిన రైతులందరికీ రుణాలను రెన్యువల్ చేయాలని మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం మాఫీ చేసిన రుణాలను రైతులకు వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, గురువయ్యగౌడ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

◆ పెళ్లి కూతురుకు పుస్తె, మట్టెలు పంపిణీ

గజ్వేల్: జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన పెళ్లి కూతురు గట్టు హారికకు వ్యాపారవేత్త గోలి సంతోష్ గుప్తా శనివారం పుస్తెమట్టెలు అందజేశారు. పేదలకు తనవంతు సేవ చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. అశోక్, భాస్కర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ బలవంతపు డిపాజిట్లు ఆపాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్ ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు రైతులను నుంచి బలవంతపు డిపాజిట్లు తీసుకుంటున్నారని, వాటిని వెంటనే ఆపాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి మూడు వేల నుంచి పది వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.